క్లుప్తంగా

మాజీ మంత్రి జన్మదిన వేడుకలు



గోపాల్‌పేట: నియోజకవర్గంలో ప్రజల కోసం కష్టపడి పనిచేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సేవలు ఉత్తమమైనవని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఆయన జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మాజీ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్, మన్యంనాయక్, బొగ్గశివ, కుమార్, ఎద్దుల గోపాల్, జహంగీర్, రాజు, నల్లబోతు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి 65వ జన్మదిన వేడుకను ఖిల్లాఘనపురంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండు దగ్గర కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పీపనగండ్ల: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మామిడి రైతులకు అందించే సబ్సిడీ కోసం రైతులు దరఖాస్తులు అందించాలని మండల ఉద్యానవన శాఖాధికారి కృష్ణ తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, రెండు పాస్‌ఫొటోలను శనివారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద అందజేయాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్‌కు సన్మానం



ఆత్మకూర్: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చాంద్‌పాషాను మున్సిపాలిటీ పాలక మండలి సభ్యులు శుక్రవారం సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి పలు భూ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, పోషన్న, నాగలక్ష్మి, నాగేందర్‌రెడ్డి, మండ్లరామకృష్ణ, తబస్సుంమొసీన్, షాహీన్‌సిరాజ్, రియాజ్‌అలీ, రవికుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి..

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మూడేళ్ల పాటు గ్రామంలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లారు. అతడితో పాటు గ్రామంలో నూతన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న ఉమామహేశ్వర్‌రెడ్డికి గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వాసుదేవారెడ్డి, కురుమన్న, ఎల్లయ్య, కురుమూర్తి, మన్నెమ్మ, గోవిందమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సంగీత, భారతి, చెన్నమ్మ, ఆశాలు శివలీల, సుగుణ, మంజుల, ఎఫ్‌ఏ ధర్మరాజు పాల్గొన్నారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజనగరం రోడ్డులోని కళ్యాణసాయి ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 6 ఉదయం 10 గంటలకు జరిగే కామ్రేడ్ ఎస్ఎస్ లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని సీపీఎం కార్యకర్తలు, నాయకులు, కామ్రేడ్ లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'ఆర్థికసాయం అందించండి'



దేవేందర్

పీపనగండ్ల: ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో కల్వరాల విద్యార్థి బండారు దేవేందర్ హైదరాబాద్‌లో భాస్కర్ మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. కానీ విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో కళాశాల ఫీజు చెల్లించేందుకు దాతలు ఆర్థికసాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. పేదరికం కారణంగా విద్యార్థి చిన్నతనం నుంచి గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించి నీట్‌లో ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడికి అండగా ఉండాలని తల్లిదండ్రులు అభ్యర్థిస్తున్నారు. సహాయం చేయాలనుకునే వారు 95028 38026, 97048 62230 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.



నాగరాలలో..



పాన్‌గల్‌లో..



వనపర్తి వెంగళ్‌రావు నగర్ కాలనీలో..

గాయత్రీదేవిగా అమ్మవారు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో హోమాలు, మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పూజల్లో కాంగ్రెస్ జిల్లా ఓబీసీ చైర్మన్ కోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూర్‌లో స్వర్ణకారుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తకోట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు



కొత్తకోట భవానీ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



జిల్లా కేంద్రంలో..

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ వెంకటరమణ

ఆత్మకూర్: మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పంచాయతీ కార్మికులు ముందుకెళ్లాలని మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ, ఈఈ మేఘారెడ్డి, ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, డీఈ రామ సుబ్బారావు, ఏఈ రుక్మేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమరచింత, ఆత్మకూర్ మండలాల పరిధిలోని కార్మికులకు నీటి సరఫరాపై మూడో రోజు అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ ద్వార సరఫరా చేస్తున్న నీరు పరిశుభ్రమైందని, దుకాణాల్లో కొని తాగుతున్న ఫిల్టర్‌వాటర్‌లో పోషకాలు ఉండవన్నారు. కార్బన్, సల్ఫర్, ఐరన్ తొలగించి ఆర్వో ప్లాంట్ల ద్వారా అమ్మే నీటితో దాహం తీరుతుంది తప్పా పోషకాలు అందవని తెలిపారు. కార్యక్రమంలో ఎపీఓ శ్రీరాంరెడ్డి, మల్టీపర్పస్ కార్మికులు, సిబ్బంది ఉన్నారు.

ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం



అమరచింత: పట్టణంలోని శ్రీ కాళికామాత ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం ద్వారా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ చేతుల మీదుగా ధ్వజారోహణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుడు శివశక్తి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కొట్టం నాగేశ్వర్ రెడ్డి, నాగభూషణంగౌడ్, రమేష్, మేర్వరాజు, మగనూర్ రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆసరా లబ్ధిదారుల నిరసన

అమరచింత: పట్టణంలోని ఆసరా పింఛన్‌దారులకు వెంటనే పెన్షన్ డబ్బులను వారివారి బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి సామేలు మాట్లాడుతూ ప్రతి నెల పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు చుట్టు తిరుగుతున్నా.. సంబంధింత బ్యాంకు మెనేజర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెన్షన్‌దారులకు డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, నాగప్ప, ఆశన్న, మహేందర్, షేక్ పర్వీన తదితరులు పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



గోపాల్‌పేట: మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డులో ఉన్న శివాలయం పునర్నిర్మాణం కోసం శుక్రవారం హైదరాబాద్ ఎండోమెంట్ అధికారులు ముగ్గు పోయించి మార్కింగ్ ఇచ్చారు. ఆలయ నిర్మాణం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ దుర్గాప్రసాద్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ శర్మ, ఏఈ బాలయ్య, స్థపతిలు గణేషన్, సంజీవకుమార్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ కొండారెడ్డి, దేవాలయ శిల్పి శంకరాచారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యుడిగా బాదం వెంకటేశ్వర్లు



కొత్తకోట రూరల్: కురుమూర్తి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా పట్టణ కేంద్రానికి చెందిన బాదం వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఆర్యవైశ్యులకు పాలక మండలిలో అవకాశం కల్పించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి కొత్తకోట ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పాలక మండలి సభ్యుడు బాదం వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కేతేపల్లిలో నిల్వనీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది



అమరచింతలో..



పీపనగండ్లలో..



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీఓ శ్రీరాం రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. తిప్పడంపల్లి పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు.

మున్సిపాలిటీలో..

పట్టణంలోని 2వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి

పాన్‌గల్: నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని కేతేపల్లి, శాగాపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాంచందర్, శ్రీలక్ష్మి, సుమిత్ర, పంచాయతీ కార్యదర్శులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటామని, పరిసరాల శుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో పర్యటించి ఏపుగా పెరిగిన గడ్డి పొదలను తొలగించడంతో పాటు నిల్వ నీటిని పారబోశారు. కార్యక్రమంలో కమిషనర్ నురుల్‌నదీం, ఆరోగ్య, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. గ్రామాల ప్రత్యేక అధికారులు నిరంతరం స్వచ్ఛత కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ ఆదేశించారు. .

ప్రత్యేక దృష్టి

పీపనగండ్ల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో అంటు రోగాల బారిన పడకుండా ఉంటారని పంచాయతీ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి నిల్వ నీటిని పారబోశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దర్గయ్య, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, మహేశ్వరి, ఆశావర్కర్లు రాణి తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: టీబీ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు రక్తం పడటం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ నిమిత్తం 14 మంది నుంచి తెమడను సేకరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ శ్రీలక్ష్మి, రాంచందర్, ఎస్టీఎల్ఎస్ ప్రవీణ, ఎస్టీఎస్ నగేష్, ఆశా కార్యకర్తలు చిన్నమ్మ, సంధ్య, ప్రమీల, కవిత పాల్గొన్నారు.

'రైతుబీమా' డబ్బులు అందజేత



రైతు కుటుంబానికి నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఇరగదిండ్ల రామస్వామి అనే రైతు కుటుంబానికి మంజూరైన రైతుబీమా నగదు రూ.5 లక్షలను శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ యువజన నాయకుడు వహీద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల క్రితం రైతు అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో రైతు పేరు మీద బీమా ఉండటంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల నగదును మృతుడి భార్య ఈశ్వరమ్మకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం రైతుబీమాను అందిస్తుందన్నారు. రైతు బీమా నగదు త్వరగా మంజూరు కావడంపై బాధిత రైతు కుటుంబం ప్రభుత్వానికి, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బంగారయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాది ఆంజనేయులు

గోపాల్‌పేట: విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ఆంజనేయులు సూచించారు. శుక్రవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన పరమైన విషయాలపైనే కాకుండా చట్టాలపై పరిజ్ఞానం, బాధ్యతలు కలిగి ఉండాలని సూచించారు. మహనీయుల చరిత్రలు తెలుసుకోవడంతో పాటు పట్టుదల, క్రమశిక్షణతో చదివి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మహిళా న్యాయవాది కళ్యాణి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు వారి హక్కులను తెలుసుకోవాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే మహిళల కోసం ఉన్న చట్టాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రఘు, కళాశాల నిర్వాహకులు శ్రీనివాసులు, రాములు, శేషయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని వార్డుల్లో ఇదివరకే ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, ప్రస్తుతం రూ.1.40 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, సీసీరోడ్లు, డ్రైయినేజీలు, జీత భత్యాలు తదితర పనుల కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ఒక జేసీబీ, ట్రాక్టర్‌ను కొనుగోలు చేయాలని తీర్మానించారు. వార్డు అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లాలని, ప్రతినిత్యం వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జనన, మరణాలు, జనాభా, సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్

అమరచింత: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామాల్లో నేరాలు నియంత్రించే అవకాశం ఉందని ఎస్ఐ సురేష్ తెలిపారు. మండలంలోని చంద్రగఢ్‌లో సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వందమంది పోలీసులు చేసే పనిని ఒక్క సీసీ కెమెరా నిర్వహిస్తుందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అసాంఘీక చర్యలతో పాటు చోరీలను అరికట్టవచ్చన్నారు. గ్రామస్తులు సహకరించి విరాళాలు అందించి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామంలోని ప్రజలంతా సీసీ కెమెరాల కోసం రూ.4 లక్షలు ఇవ్వడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

మల్దకల్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజు సూచించారు. శుక్రవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమని, భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ, రమేష్‌లింగం, రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, గోవర్ధన్‌శెట్టి, భాగ్యలక్ష్మి, దేవసేనారెడ్డి, శ్రీనాథ్, తిమ్మోతి, ఇష్తాకర్, కమలహసన్ తదితరులు పాల్గొన్నారు.